# స్వల్పకాలానికి

# 20218 వద్ద కీలక నిరోధం




**సమీక్ష:** దేశీయ సానుకూల పవనాల వల్ల మార్కెట్ వారాంతానికి 356 పాయింట్ల లాభాన్ని పొందింది. అనుకూల అంతర్జాతీయ ధోరణులతో మార్కెట్ లాభాలతోనే ప్రారంభమైంది. నవంబరు నెలకు ద్రవ్యోల్బణం 7.48 శాతానికి పరిమితం కావడంతో ఇంకా జోరందుకుంది. ఆర్‌బీఐ సమీక్ష ముందు రోజు లాభాల స్వీకరణ జరిగినా.. సమీక్ష మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ఉండడంతో సెంటిమెంటు మెరుగుపడింది. ముందస్తు కార్పొరేట్ పన్ను చెల్లింపులు సైతం మెరుగ్గా ఉండడంతో నిఫ్టీ ఒక దశలో 5956 స్థాయినీ తాకింది. గతవారంలో ఆహార ద్రవ్యోల్బణం, పెరిగిన పెట్రోలు ధరల పెంపు వంటివి మార్కెట్ భారీ లాభాలను గడించకుండా అడ్డుకున్నాయి.

విదేశీ సంస్థాగత మదుపర్లు(ఎఫ్ఐఐ) రూ.1119 కోట్ల నికర విక్రయాలు జరపగా.. ఫండ్లు రూ.940 కోట్ల నికర కొనుగోళ్లు జరిపాయి.

**రంగాల వారీగా:** ప్రధాన కంపెనీలు భారీగా ముందస్తు పన్ను చెల్లింపులు చేయడంతో ఐటీ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ కమోడిటీ ధరలు పెరగడంతో లోహ సూచీ మెరిసింది. తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లు జరగడంతో మన్నికైన వినిమయ వస్తువులు లాభపడ్డాయి. ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంకింగ్‌లకు విక్రయాల ఒత్తిళ్లు ఎదురయ్యాయి. ముడి పదార్థాల ధరలు పెరగడంతో మార్జిన్లపై ఒత్తిడి పడుతుందన్న ఆందోళన మధ్య వాహన షేర్లు కిందకు జారాయి.

గురువారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం చూస్తే మార్కెట్ తీరు మారినట్లు కనిపిస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో ఈ వారం మార్కెట్ ఊగిసలాటకు గురికావచ్చు. 60 రోజుల చలన సగటు 20,087 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయి పైన మార్కెట్ ముగిస్తే మాత్రం స్వల్పకాలంలో ర్యాలీని అంచనా వేయొచ్చు.

మార్కెట్ మొత్తం మీద బలహీనంగా ఉండొచ్చు. ఒక శ్రేణిలో స్థిరంగా కదలికలు ఉంటే కనుక చిన్న, మధ్య స్థాయి విలువ షేర్లపై ఆసక్తి పెరగవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** సంవత్సరాంతం కారణంగా ఎఫ్ఐఐలు గత రెండు వారాలుగా నికర విక్రయదార్లుగా మారారు. ఆ ధోరణి కొనసాగితే మార్కెట్ ఊర్ధ్వ గమనానికి అడ్డుకట్ట పడొచ్చు.ఈ వారంలో వెలువడే ఆహార ద్రవ్యోల్బణం పెరిగితే వడ్డీ రేట్లతో ప్రభావితయ్యే రంగాలపై ఒత్తిడి పెరగొచ్చు. ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు డీజిల్ ధరల పెంపునకు అనుమతిపై డిసెంబరు 22న జరిగే కమిటీ సమావేశాన్ని మార్కెట్ దగ్గరగా పరిశీలించొచ్చు. అంతర్జాతీయంగా చూస్తే అమెరికా జీడీపీ, నిరుద్యోగ గణాంకాలు, యూరోజోన్ దేశాల్లో రుణాల తిరిగి చెల్లింపులపై జరిగే పరిణామాలు సైతం మార్కెట్ దిశను నిర్దేశించొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 19571, 19321, 19075;

**తక్షణ నిరోధ స్థాయిలు:** 20008, 20218, 20310

**స్వల్పకాలంలో 20218 వద్ద బలమైన నిరోధం ఎదురుకావచ్చు.**

– సతీశ్ కంతేటి, జెన్ మనీ